పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


హైదర్‌గూడలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీసీ రవికుమార్

అత్తాపూర్: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ అన్నారు. శుక్రవారం అత్తాపూర్ డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య పనులను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ... దీపావళి పండుగ సందర్భంగా రోడ్లపై ఏర్పడిన చెత్తచెదారాలను, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించామన్నారు. ప్రజలు తమ ఇంట్లోని చెత్తను ప్రతి రోజూ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఏఎంవోహెచ్, ఎస్ఎస్‌లు, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని వినతి


కౌన్సిలర్ అశోక్‌కు వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

శంషాబాద్: పట్టణంలోని తొమ్మిదోవార్డు పరిధిలోని ఎస్ఆర్‌బీ వెంచర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు, కౌన్సిలర్ చెన్నం అశోక్‌లను కోరారు. ఈ మేరకు వారికి వినతి పత్రాలను సమర్పించారు. మున్సిపాలిటీ పరిధిలోనే ఎస్ఆర్‌బీ వెంచర్ కాలనీ ఉన్నా మౌలిక వసతులు ఇప్పటి వరకు స్వయంగా చేపట్టుకున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు నాసరయ్య, ప్రధాన కార్యదర్శి వేణు బృందం వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇకపై కాలనీలో వీధి దీపాల ఏర్పాటు, రహదారుల అభివృద్ధితో పాటు కాలనీలోని పార్కు స్థలాలు, దేవాలయాలకు కేటాయించిన భూములను మున్సిపల్ అధికారులు స్వాధీని చేసుకుని పరిరక్షించాలని కోరారు.

అయ్యప్పలకు నిత్య భిక్ష ఏర్పాటు

మణికొండ: భక్తి శ్రద్ధలతో నిష్టగా అయ్యప్ప స్వామిని కొలిచే మాలాధారులకు మధ్యాహ్నం భిక్ష (భోజనం) ఒక్కొక్క సారి ఇబ్బంది కలుగుతుందని, అలాంటి వారి ఇబ్బందులను తీర్చేందుకు మణికొండ శివాలయం ఆవరణలో కొన్ని సంవత్సరాలగా నిత్య అన్నదానం ప్రారంభించామని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్, గురుస్వామి కె.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభించిన అన్నదానం డిసెంబర్ 14వ తేదీ వరకు నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనులపై బయట తిరిగే అయ్యప్ప మాలాధారులు రోజూ వందలాది మంది శివాలయంలో భిక్ష స్వీకరిస్తారని ఆయన అన్నారు. భక్తుల విరాళాలతోనే ఈ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతున్నదన్నారు. అయ్యప్ప మాలను


అయ్యప్ప స్వాములను భిక్ష ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

ధరించిన భక్తులు భిక్షను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మణికొండ దేవాలయాల కమిటీ చైర్మన్, గురుస్వామి సి.రాజేందర్‌గౌడ్, గురుస్వామి కె.ప్రభాకర్‌రెడ్డి, నాయకులు బి.శ్రీరాములు, బాలరాజు, శ్రీనివాస్, ఎం.రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెలికాం అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా పోరెడ్డి బుచ్చిరెడ్డి


పోరెడ్డి బుచ్చిరెడ్డికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, పక్కన రవికుమార్‌యాదవ్

శేరిలింగంపల్లి: టెలికాం అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ ఉపాధ్యక్షులు పోరెడ్డి బుచ్చిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ ఎం.రవికుమార్ యాదవ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెలికాం విభాగం పటిష్టత, అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అడ్వైజరీ బోర్డు మెంబర్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నిబద్ధతతో పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామిరెడ్డి, జితేందర్, వరప్రసాద్, శాంతి భూషణ్‌రెడ్డి, సీతారామరాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సదర్

- నార్సింగి, కోకాపేటలో ఘనంగా సదర్ ఉత్సవాలు
- నేత్రపర్వంగా దున్నపోతుల విన్యాసాలు
- సంస్కృతిని భావితరాలకు అందించాలి
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


కోకాపేట సదర్ ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: సదర్ వేడుకలు రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని యాదవ కులస్తులు నిర్వహించే సదర్ వేడుకలు అంబరాన్నంటాయి. దీపావళి సందర్భంగా యాదవులు నిర్వహించే సదర్ ఉత్సవాలు వారి షాన్‌ను తెలుపుతాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం, కోకాపేటలలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పండగలు మనకు సంతోషాలు పంచేందుకు వస్తాయని, వాటిని అందరూ కలిసి మెలిసి నిర్వహించుకుంటే అది మరింత రెట్టింపు అవుతుందన్నారు. హిందువుల పండగలు ప్రకృతి, పర్యావరణం, పశు, పక్షాదులను పూజించేలా ఉంటాయన్నారు. వాటిని భావి తరాల వారికి అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముదిరాజ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, నార్సింగి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, శ్రీకృష్ణ యాదవ్ యూత్, యాదవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సదర్ ఉత్సవాలకు వచ్చిన దున్నపోతులకు పూజలు నిర్వహించి అనంతరం తీన్‌మార్ స్టెప్పులతో వాటిని ఆడించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సైతం స్టెప్పులు వేశారు.


నార్సింగి సదర్ ఉత్సవాల్లో కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్


నార్సింగి సదర్ ఉత్సవాల్లో స్టెప్పులు వేసిన ఎమ్మెల్యే...


కార్తీక పూజలకు సిద్ధమైన పుప్పాలగూడ కాశీవిశ్వేశ్వరాలయం


ఏర్పాట్లు పూర్తి చేసుకున్న మణికొండ శివాలయం

కార్తీకం..శివోహం

- నేటి నుంచి కార్తీకమాసోత్సవాలు
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన శైవ క్షేత్రాలు
- ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు



మణికొండ: హిందువులకు పవిత్రమాసాలలో ఒకటైన కార్తీకమాస పూజలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. గండిపేట మండల పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, మంచిరేవుల, ఖానాపూర్ తదితర గ్రామాలలోని ప్రముఖ శైవ క్షేత్రాలు కార్తీక పూజలకు సిద్ధమయ్యాయి. అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ఆయా దేవాలయాల కమిటీలతో పాటు మున్సిపాలిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. అటు ఈశ్వరుడికి, ఇటు వెంకటేశ్వరస్వామిలను మాసం మొత్తం కొలిచేందుకు భక్తులు సిద్ధమయ్యారు. కార్తీక మాసంలో కొందరు భక్తులు ఉపవాస దీక్షలు, దీపాలంకరణ, అభిషేకాలు, అర్చనలు, హోమాలు, ఆకాశదీపాల దర్శనాలు నిర్వహిస్తు ఆ దేవుళ్లను తమను చల్లగా చూడాలని వేడుకుంటారు. కార్తీక మాసంలో దైవదర్శనాలు చేసుకునే భక్తులతో పాటు ప్రతి సోమవారం, కార్తీక పౌర్ణమి రోజు భక్తులు పెద్ద ఎత్తున దేవాలయాలకు వచ్చి పూజలు నిర్వహిస్తారు. శివకేశవులిద్దరికీ పవిత్ర మాసంగా నిలవటంతో పాటు భక్తులకు ముక్తి మార్గాన్ని ప్రసాదించే మాసంగా కార్తీకమాసాన్ని హిందువులు పాటిస్తారు. మండల పరిధిలోని మణికొండ శ్రీపార్వతీరామలింగేశ్వరాలయం, పుప్పాలగూడ శ్రీకాశీవిశ్వేశ్వరాలయం, మంచిరేవుల మచిలేశ్వరాలయం, ఖానాపూర్‌లో రాజన్నగుట్ట తదితర ఆలయాలకు కార్తీకమాస పూజల నిమిత్తం అందంగా అలంకరించారు. భక్తులకు కావల్సిన ఏర్పాట్లను ఆయా దేవాలయాల కమిటీలు పర్యవేక్షిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో దేవాలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లను చేస్తున్నారు. ఉదయం ఐదు నుంచి రాత్రి 8 గంటల వరకు దేవాలయాల్లో పూజలు నిర్వహించేందుకు అటు అర్చకులతో పాటు ఇటు భక్తులు సిద్ధమయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో దూరవిద్యా కోర్సులలో అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నామని 'మనూ' సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ శుక్రవారం తెలిపారు. దూర విద్య విధానంలో పోస్టుగాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్ ఫీజు నవంబర్ 14వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఎంఏ(ఉర్దూ, హిందీ, అరబిక్, హిస్టరీ, (ఇస్లామిక్ స్టడీస్), బీఏ, బీకామ్, బీఎస్సీలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతున్నామన్నారు. బీఎస్సీ(లైఫ్ సైన్సెస్), బీఎస్సీ(భౌతికశాస్త్రం) డిప్లొమో ఇన్ జర్నలిజమ్ అండ్ మాస్ కమ్యూనికేషన్, టీచ్ ఇంగ్లిష్, ఎర్లీ చైల్డ్ హుడ్‌కేర్ అండ్ ఎడ్యుకేషన్, స్కూల్ లీడర్‌షిప్, మేనేజ్‌మెంట్, ఎంప్లాయబిలిటీ స్కిల్స్, ఇంగ్లిష్ ద్వారా ఉర్దూలో ప్రావీణ్యం, ఫంక్షనల్ ఇంగ్లిష్‌లో సర్టిఫికెట్ వంటి కోర్సులు అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు కోసం స్టూడెంట్ సపోర్ట్ యూనిట్(ఎస్ఎస్‌యూ) హెల్ప్‌లైన్‌ల కోసం 040-23008463 లేదా 040-23120600 (ఎక్స్‌టెన్షన్ 2207, 2208)లో సంప్రదించాలని ఆయన సూచించారు.

సండే ఈవినింగ్ టాక్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది. ఈ సందర్భంగా 'ఇంపార్టెన్స్ ఆఫ్ డెంటల్ హెల్త్ ఫర్ జనరల్ హెల్త్' అనే అంశంపై డాక్టర్ సుహాస్ తర్లపల్లి ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

అన్నదానం.. పుణ్యకార్యం


మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: అన్నదానం మహా పుణ్యకార్యమని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాబుల్‌రెడ్డినగర్‌లో శ్రీపోచమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి అమావాస్య రోజున భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి అమావాస్య రోజున భక్తులకు అన్నదానం చేయడం వలన పుణ్యకార్యతోపాటు భక్తి విశ్వాసం పెరుగుతుందన్నారు. దేవాలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ఆలయ నిర్వాహకులను ఆయన అభినందించారు. నిర్వాహకులతో కలిసి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్, రమేష్ రెడ్డి, సంతుగౌడ్, రమణ, గోపాల్ నాయక్, శంకర్, రాజు పాల్గొన్నారు.

హాష్ ఆయిల్ విక్రయిస్తున్న మహిళ అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న హాష్ ఆయిల్

రాజేంద్రనగర్: హాష్ ఆయిల్‌ను విక్రయిస్తున్న ఓ మహిళను రాజేంద్రనగర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఆమె వద్ద ఉన్న 231 గ్రాముల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... బండ్లగూడ పీ అండ్ టీ కాలనీ ప్రాంతానికి చెందిన రహీమున్నీసా(48) కొన్ని రోజులుగా 4-5 గ్రాముల హాష్ ఆయిల్‌ను చిన్న చిన్న బాటిళ్లలో నింపి అవసరమైన వారికి విక్రయిస్తుంది. ఈ సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ఆమె ఇంటిపై దాడి చేసి 60 చిన్న బాటిళ్ల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల రహీమున్నీసా కుమారుడిని కూడా రాజేంద్రనగర్ పోలీసులు హాష్ ఆయిల్ విక్రయిస్తుండగా పట్టుకున్నారు. మిగిలిన హాష్ ఆయిల్‌ను తల్లి రహీమున్నీసా విక్రయిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి


డాక్టర్ మహ్మద్ ఖరీమ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: వైద్యుల సేవలు వెలకట్టలేనివని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ తెలంగాణ పీస్ అంబాసిడర్ మహ్మద్ నజీబ్ అన్నారు. రెండు దశాబ్దాలుగా వైద్య రంగంలో పేద బడుగు వర్గాలకు సేవలు అందిస్తున్న డాక్టర్ మహ్మద్ ఖరీమ్‌ను శుక్రవారం టోలిచౌకీలోని మహ్మద్ నజీబ్ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖరీమ్‌కు శాలువా కప్పి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా మహ్మద్ నజీబ్ మాట్లాడుతూ.. పేదలు నివసించే బస్తీల మధ్యలో ఆసుపత్రిని నిర్వహిస్తూ వచ్చిన ప్రతి రోగికి సేవలు అందిస్తూ ఎన్నో ప్రాణాలు నిలుపుతున్న డాక్టర్ ఖరీమ్ పేదల పాలిట ఆపద్బాంధవుడిగా పేరు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ఫజల్, సమీర్, నయీం, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఉచిత స్క్రీనింగ్ క్యాంపు

- బాలల దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఏర్పాటు
- అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు: డైరెక్టర్

లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఉచిత స్క్రీనింగ్ క్యాంపును నిర్వహిస్తుంది. శుక్రవారం ప్రారంభమైన ఈ క్యాంపు ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగుతుంది. నిమ్స్ ఆవరణలోని పాత ఓపీడీ బ్లాక్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకొని రూమ్ నెం. 8లో వైద్యున్ని సంప్రదించాల్సి ఉంటుంది. ఈ శిబిరంలో పిల్లల వైద్య ప్లాస్టిక్ శస్త్రచికిత్సలో పిల్లలకు సంబంధించి మొర్రి (క్లెఫ్ట్), క్రానియో ఫేషియల్ అసామాన్యతలు, పుట్టుకతో హస్త విపత్తులు, పక్షవాతం, కాలిపోయిన లేదా ప్రమాదానంతరం ఏర్పడిన వైకల్యతలు, రక్తనాళ అసామాన్యతలు, 12-14 సంవత్సరాల వయస్సులోపు పిల్లలలో ఉన్న ఇతర లోపాలను గుర్తించి ఉచిత శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పార్వతిలు తెలిపారు. ఆరోగ్య శ్రీ, పీఎంఆర్ఎఫ్, ఎల్‌ఓసీ ద్వారా శస్త్రచికిత్సలు అందించనున్నామన్నారు. ఆయా రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. సమాచారం కోసం 9393835845, 040-23489049ల ద్వారా సంప్రదించాల్సిందిగా సూచించారు.

యువతిని వేధిస్తున్న ఆటోడ్రైవర్‌పై కేసు

బంజారాహిల్స్: యువతిని వేధింపులకు గురిచేస్తున్న ఆటోడ్రైవర్‌పై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వెంకటగిరికి చెందిన ఓ యువతి (20)కి 2023లో ఆటోడ్రైవర్ నవాజ్ పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో నవాజ్ ఆమె ఫోన్ నెంబర్‌ను కూడా సేకరించాడు. అప్పటి నుంచి ఫోన్‌లో మెసేజ్ చేస్తూ పెళ్లి చేసుకుంటానని వేధింపులకు గురిచేస్తున్నాడు. అయితే నవాజ్‌కు అప్పటికే పెళ్లయిందన్న విషయం తెలుసుకున్న ఆ యువతి అతనితో మాట్లాడేందుకు నిరాకరిస్తూ వస్తోంది. యువతి బయటకు వచ్చిన సమయంలో ఆమెవెంట పడుతున్నాడు. అలాగే ఫోన్లకు విపరీతమైన మెసేజ్‌లు పంపిస్తుండడంతో వేధింపులు భరించలేక ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో డ్రైవర్ నవాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ చంద్రనాయక్

అత్తాపూర్: దీపావళి పండుగకు వారం రోజుల ముందు నుంచే బాణసంచా కాల్చడంలో మెళకువలు, విక్రయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని రాజేంద్రనగర్ ఫైర్ ఆఫీసర్ చంద్రనాయక్ తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 120 షాపులకు అనుమతులు ఇచ్చామని, ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు, చర్యల్లో భాగంగా దుకాణాలు ఏర్పరచుకున్న యజమానులకు సూచనలు చేశామని వివరించారు. తాము చేపట్టిన ముందస్తు జాగ్రత్తల కారణంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఎలాంటి ప్రమాదాలు జరగలేదని, ఇందుకు సహకరించిన సిబ్బందికి, ప్రజలకు చంద్రానాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

అలకాపూర్‌లో అన్నదానం


అలకాపూర్‌లో అన్నదానం చేస్తున్న అసోసియేషన్ నేతలు

మణికొండ: అన్నదానంతో ఎంతో మంది ఆకలి తీర్చటంతో ఎంతో తృప్తిని ఇస్తుందని, ప్రతి అమావాస్యకు వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున క్రమం తప్పకుండా అన్నదానం నిర్వహిస్తున్నామని మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి అన్నారు. శుక్రవారం అలకాపూర్ టౌన్‌షిప్‌లోని వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని రకాల సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు తమ అసోసియేషన్ సిద్ధం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

అధికారులకు శిక్షణ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్‌లోని వివిధ అధికారులు, సిబ్బందికి శుక్రవారం ఎన్యూమరేషన్ బ్లాక్ సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు పలు అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని రాయల్ హయాత్ కన్వెన్షన్ హాల్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఏసీ అశోక్ సామ్రాట్,, రాజేంద్రనగర్ డీసీ రవికుమార్, ఏసీపీ, నోడల్ అధికారి, ఏఎంసీ జయప్రకాశ్, సర్కిల్ స్థాయి మాస్టర్ ట్రైనర్లు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ వసీం తదితరులు పాల్గొన్నారు.

నేడు కోవెల రంగనాయక స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


పూజల్లో కార్యనిర్వహణాధికారి వసంత తదితరులు

గోల్కొండ: నేడు నానల్ నగర్ డివిజన్ ఫ్లోర్ మిల్ తిరుపల్లి గడ్డలోని కొవెల రంగనాయకస్వామి ఆలయంలో శివలింగ ప్రతిష్ఠాపనోహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి సి.వసంత తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని గణపతి పూజ, విశ్వక్‌సేన ఆరాధాన, వాసుదేవ, పుణ్యావచనం, రుత్విక్‌వరణం, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అఖండ దీప స్థాపన తదితర కార్యక్రమాలు పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా శనివారం, ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

వాకింగ్ చేస్తుండగా గుండెపోటు


రెగేఅలీ అహ్మద్

బంజారాహిల్స్: వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన సోమాలియా దేశస్తుడు బంజారాహిల్స్‌లోని కే బీఆర్ పార్కులో వాకింగ్ చేస్తుండగా గుండెపోటు రావడంతో మృతి చెందిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... సోమాలియాకు చెందిన రెగే అలీ అహ్మద్ (54) వైద్య చికిత్స నిమిత్తం సెప్టెంబర్ 10వ తేదీన హైదరాబాద్‌కు వచ్చాడు. టోలిచౌకి పారామౌంట్ కాలనీలో తన దేశానికి చెందినవారితో కలిసి ఉంటున్నాడు. ప్రతిరోజూ సోమాలియా దేశానికే చెందిన నలుగురు సన్నిహితులతో కేబీఆర్ పార్కుకు వాకింగ్‌కు వస్తున్నాడు. గురువారం సాయంత్రం కూడా పార్కులో వాకింగ్ చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపడిపోయాడు. ఆందోళన చెందిన సన్నిహితులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంటలు అంటుకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బంజారాహిల్స్: మంటలంటుకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం బంజారాహిల్స్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12 ప్రధాన రహదారిలోని హిందూ శ్మశానవాటిక నుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి (35)కి మంటలు అంటుకోవడంతో కేకలు పెడుతూ రోడ్డుపైకి పరుగులు తీశాడు. చుట్టుపక్కల వారు అప్రమత్తమై మంటలు ఆర్పి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఆధారాలు సేకరించారు. సదరు వ్యక్తి ఎక్కడి నుంచి వచ్చాడన్న దానిపై ఆరా తీశారు. అయితే స్థానికంగా యాచిస్తూ పొట్ట పోసుకుంటున్నట్లుగా తేలింది. దీపావళి పండుగ సందర్భంగా శ్మశానవాటికలో సమాధుల వద్ద దీపాలు వెలిగించడంతో అక్కడ ఉన్న చెత్తాచెదారం వల్ల మంటలు అంటుకొని మృతి చెందినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. కాగా మృతుడికి సంబంధించిన వివరాల కోసం ఆరా తీస్తున్నారు.